# పీజా ( కథానిక )

– రామారావు పులవర్తి, Iselin, NJ.

ఓ పీజా ! నా పీజా ! సున్నితంగా టి.వి. ఆడ్‌లో పంచవన్నెల విసనకర్రలా కనపడే ఈ మయదారి పీజా ఇంత మాయదారిదని నేనెన్నడు కలలో కూడా ఊహించలేదు. సంసారాలనే మార్చే బాంబని, టైంబాంబని మెడమీద తలవున్నవాడెవడూ అనుకోడు. అది కలలోగాని, కనీసం పగటికలలో గాని ఊహకందని విషయం, యు.ఎస్.ఎ. అనబడే ఈ అమెరికాలో కూడా. కాని జరగరానిదే జరగబోయిందిక్కడ. ఇడ్లీలున్నాయి, దోసెలున్నాయి. పెసరెట్లు, పకోడీలు కూడ కొత్తకాదు ఆంధ్రావనిలో. రోజూరోజూ కాకపోయినా, వారంవారమో, కనీసం నెలకొకసారైనా మన ఇళ్ళలో తినేవే, ఇష్టపడేవే. విజయవాడలో బాబయ్య హోటల్లోనో, విశాఖలో జగదాంబలోనో (ఒలమ్మో ఒలమ్మో!), హైదరాబాదు వెళ్ళినప్పుడు కామత్‌లోనో ఇష్టపడి నేను చిన్నప్పుడు విద్యార్థిగాను, తదుపరి తినేదాన్ని. కాని వాటినిగుర్చి తలలో చిచ్చు పెట్టుకోలేదు. సామాన్యమైన చిరుతిండిగానో, బ్రేక్‌ఫాస్టుగానో ఊహించి తినేదాన్ని. తదుపరి కలలా మరచిపోయేదాన్ని.

అమెరికా వచ్చాక కూడ నేనుగాని, శ్రీవారుగాని ఇడ్లీ, పెసరట్టు, దోసె-ఏదో ఒకదానితో సరిపుచ్చుకొనేవాళ్ళం. ఫస్టు జెనరేషన్ వాళ్ళవటం వలన కాబోలు, జిహ్వాచాపల్యం వలననే కావచ్చు వాటితో తృప్తిపడేవాళ్ళం. ప్రతినిత్యం తినాలనే పట్టింపు, బిగింపు ఉండేది కాదు. కాని హాలీవుడ్ నుండి స్త్రీల హక్కుల దాకా స్వతంత్ర భావాలొలకపోసే నేను, తిండివిషయంలో శాతవాహనుల కాలంనాటి దానినే. ఈ వైరుధ్యం ఎత్తిచూపడం మా పిల్లలవంతయింది.

కాలానుగుణంగా మాకు పిల్లాపీచు కలిగారు. అమ్మాయి సుగుణ పెద్దది. తరువాత సుపుత్రుడు సతీష్. ఎదిగి ఎదిగి వారిద్దరు స్కూలు, కాలేజి చదువులలో ప్రవేశించారు. స్వంతభావాలు, స్వంత అభిరుచులు, స్వంత స్నేహితులు. ఇంట్లోనప్పుడు, లైబ్రరీలోనో, క్లాస్‌మేట్సుతోనో తిరిగేవారు. ఉదయం ఏడింటికి బయలుదేరితే తిరిగి సాయంత్రం 6,7 గంటలకు తిరిగి ఇంటికి ప్రత్యక్షం. ఉదయం సాండ్‌విచస్, కాఫీతో బ్రేక్‌ఫాస్ట్ ముగించి వాళ్ళ వాహనాలలో బయటపడేవారు. నేనే వాటిని చేసి తినిపించేదానిని. మధ్యాహ్నం స్కూలు క్యాంటీన్‌లో క్లాస్‌మేట్స్‌తో కలిసి లంచ్ చేసి సాయంత్రానికి ఆవురావురంటూ ఇంటికి చేరేవారు. వస్తూనే ఐస్‌క్రీమో, కేకో తిని రాత్రి భోజనానికి ఎదురుచూచేవారు. అదే వారికి, మాకూ డిన్నర్ అనే ప్రిన్సిపల్ మీల్. నేను నా జాబ్‌నుంచి త్వరత్వరగా ఇల్లుచేరి వంట ప్రయత్నంలో మునిగిపోయేకదాన్ని. ఏదో మాకిష్టమైన, చిన్నప్పటినుంచీ తినే తెలుగువాళ్ళ కూర, పచ్చడి, సాంబారు చేసేదానిని. నలుగురం కూర్చుని కబుర్లాడుతూ తినేవాళ్ళం. నిజం చెప్పాలంటే నేను, శ్రీవారు పొందికగా తినేవాళ్ళం. కాని ఈ మధ్య సుగుణ, సతీష్ ఈ ఆధరువులను ముట్టమంటే ముట్టమంటున్నారు. వారిదీక్ష నిరాహారదీక్ష వరకు పోయిందంటే నేను ఎంతగానో లోలోన బాధపడేదానిని. నా బుజ్జగింపు, శ్రీవారి మందలింపు కొంతకాలంగా వారిని వారి నిరశనవ్రతం నుండి మళ్ళించలేకపోయాయి.

నాకు వారి ప్రవర్తన అంతుపట్టడంలేదు. వారి నిరాదరణకు కారణం ఏమైవుంటుందా అని నేను వారి తల్లిగా కుమిలిపోయాను. ఇలాఉండగా నిన్నకాక మొన్న జరిగిన సంఘటన నన్ను ఆశ్చర్యంలో ముంచేసింది. సుగుణ సతీష్ వాళ్ళ మిత్రబృందంతో రామదండులాగా సాయంత్రం క్రిందనున్న బేస్‌మెంటులో చేరారు. పాప్ మ్యూజిక్ హోరెత్తించారు, పాటలకు, పద ఘటనలకు అంతేలేదు. అంతలోనే బయట కాలింగ్‌బెల్ మ్రోగింది. తలుపు తెరిచానో లేదో 'డామినోస్' కుర్రాడు ఒక డజను పీజాలతో ప్రత్యక్షమయ్యాడు. ఏమిటి విషయమయంటే, సుగుణ ఆర్డరిచ్చిందన్నాడు. క్రిందకు దిగి డెలివరీ చేసి తిరిగి వెళ్ళిపోయాడు. అంతే! నిముషాలలో సద్దుమణిగింది. మాటలు తగ్గి లొట్టలు వినపడసాగాయి.

గంట అయిందో లేదో పోలోమంటూ కుర్రమేళం బయటకు దారితీసింది. తెల్లాళ్ళు, తెలుగువాళ్ళు ఆడా మగా అంతా పదిమందిదాకా వున్నారు. బై బై చెప్పేసి సుగుణ, సతీష్ పైకి లివింగ్‌రూమ్‌లోకి వచ్చి టి.వి. ఆన్ చేసారు. ఎనిమిది దాటింది గదా భోజనానికి రమ్మన్నాను. పీజా తిన్నాంగదా, ఇంక ఆకలేమిటి అన్నారు. పీజాతో ఆకలేమి తీరుతుంది, పెరుగన్నమేనా తినమన్నాను. ససేమిరా వద్దని వాళ్ళ రూముల్లోకి పోయి తలుపులేసుకున్నారు.

నా బుర్ర తీవ్రంగా పనిచేయసాగింది. వేడెక్కింది. కాస్సేపటికి "యురేకా" అని ఎగిరి గంతేసేను. ఇంతకాలం పగటి వెలుగులో కూడ కంటితో చూడలేని గుడ్డినా? సుగుణ, సతీష్‌లకు నచ్చిన డిన్నర్ పీజా! నచ్చనిది (పాత చింతకాయ) పచ్చడి, కూర, పులుసు. వాళ్ళకు నచ్చినది చేసిపెడితే పోలా? చిన్న సమస్యను చిటికెన వేలుతో తీసెయ్యాలిగాని రాచపుండు చేయరాదు గదా.

పీజా మహాత్యం నాకు బోధపడసాగింది. ఇంతవరకు నాకు అర్థమైనది పీజా అంటే మైదా, ఛీజ్, టమేటో ముక్కలు. నా దృష్టిలో అది చిరుతిండి మాత్రమే. అది, మనలో మనమాట, ఇడ్లీ-చట్నీ, అల్లం-పెసరట్టు ముందు దిగదుడుపే. కాని కారం ఉప్పు పడని ఇక్కడి పిల్లలకు పీజాయే అన్నం, పరమాన్నం-కాలహరణం కాని టైమ్ కాప్సూల్. అదే శ్రీరామరక్ష, స్టూడెంట్స్‌కు ముఖ్యంగా. పీజాహట్, మెక్డానల్డ్స్, అమెరికా సంస్కృతికి కొండగుర్తులన్నమాట.

తత్వం అర్థమైంది. ఆచరణకు మార్గం అన్వేషించసాగేను. ఆ ఘడియ త్వరలో రానే వచ్చింది. మరుసటిరోజు సాయంత్రం ఎనిమిది గంటలైంది. సుగుణ ఇంటికి రాలేదు. సతీష్‌ని అడిగితే తెలీదన్నాడు. క్లాస్‌మేట్సు సిండి, ఆమె కజిన్ బిల్ లతో వెళ్ళాలని చెప్పిందన్నాడు. నా మనస్సు పరిపరివిధాల పరుగుతీసింది. సిండి నెమ్మదైన పిల్ల. కాని బిల్‌కు దుడుకుతనం, చొరవ ఎక్కువ. ఆడపిల్లలతో కూడ పూసుకొని తిరుగుతాడు. 18 ఏండ్లవాడు పాతిక ఏండ్లవానిలా దృఢంగా, ఆజానుబాహువుగా కనిపిస్తాడు. ఈమధ్య కార్‌పూల్‌లో తరచు మాపిల్లలతో వస్తున్నాడు. శ్రీవారితో విషయం చెప్పాను. విడమరచి నా భయాందోళనకు కారణం చెప్పాను. కన్నీరు పర్యంతం అయింది.

"ఉపాయం లేని వారిని అమెరికా విడిచి పొమ్మన్నారు. నువ్వు చిన్నయసూరి వ్రాసిన నీతిచంద్రిక చదివేవుగదా." అని ప్రశ్నవేసేరు.

"చదవలేదు." అని జవాబు చెప్పాను.

"మరి కన్యాశుల్కం-గురజాడ వారి నాటకం- అదైనా చదివావా? లేదా?" అని మరోప్రశ్న.

"మన ఇద్దరిలో ఒకరికైనా మతి పోయినట్లుంది. లేకపోతే, నా భయానికి, కన్యాశుల్కానికి అన్వయం ఎక్కడుందండి? హాస్యానికి కూడ సమయ సందర్భాలుండాలని మీరేగా ఇదివరలో చెప్పారు?" అని అడిగాను.

"అక్కడే ఉందోయి తత్వరహస్యం. గిరీశం ఏమన్నాడు? కథ అడ్డం తిరిగిన సందర్భంలో ఏం చెయ్యాలన్నాడు? అటునుంచి నరుక్కురావాలన్నాడా, లేదా? అర్థం చేసుకోవూ?"

నేనన్నాను "ఈ కథలూ, నరుక్కోవడాలు నా మేధకు అందవు. పెళ్ళీడుకొచ్చిన సుగుణ గురించిగదా మనమాలోచించవలసినది. ఇంతవరకు వంట చేయనేలేదు."

"అదేనండి శ్రీమతిగారూ. ఆఫోను తీసుకొని పీజాహట్‌కు కాల్‌చెయ్యి. ఈ రాత్రికి మనందరికి పీజాయే డిన్నర్. నాలుగు వెజ్ టొమేటో టాప్డ్ ఛీజ్ పీజాలకు ఆర్డరియ్యి. సుగుణ వచ్చే టైమయింది. సుగుణోపాసనే పీజా తినడం. అదే నీ దిగులుకు తరుణోపాయం. తెలిసిందా పీజా మజాకా?"

మాటలోనే సుగుణ వచ్చింది. పీజా డెలివరి కుర్రాడు వచ్చాడు. రోజూ రాత్రి అందరికి డిన్నర్‌కోసం ఇంటిలోనే పీజా చేస్తానని ప్రకటించాను. పీజా కోసం బయటకు రాత్రి పోవద్దని పిల్లలను ఒప్పించాను. తిరిగి మాకుటుంబం రాజమండ్రి గోదావరిలా, న్యూయార్క్ హడ్సన్‌లా పోసాగింది హుందాగా, తాపీగా, సాఫీగా........ ☆